COMMUNIST PARTY OF INDIA (MARXIST)
ANDHRA PRADESH COMMITTEE
H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

# భూసేకరణ (2013) చట్టానికి సవరణలు వద్దు ప్రభుత్వం బలవంతపు భూసేకరణ ఆపాలి

**ప్రచురణార్థం:** జనవరి 11,12 తేదీలలో ఎం.ఏ.గఫూర్ అధ్యక్షతన జరిగిన పార్టీ రాష్ట్రకమిటీ సమావేశం ఆమోదించిన తీర్మానాన్ని ప్రచురణార్థం పంపుతున్నాము. **– ఆఫీసు కార్యదర్శి**

**భూసేకరణ (2013) చట్టానికి సవరణలు చేయరాదని, బలవంతపు భూసేకరణను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని, నిర్భంద చర్యలను విడనాడాలని సిపియం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది. భూములు నిలబెట్టుకోవడానికి రైతాంగం, ఇతర పేదలు చేసే న్యాయమైన పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నది.**

రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి, ఎయిర్‌పోర్టులు, పోర్టులు, విద్యుత్‌ప్లాంట్లు, ఎస్.ఈ.జెడ్.లు, కోస్టల్ కారిడార్‌ల పేరుతో అవసరాలకు మించి రైతులనుండి బలవంతంగా భూములు లాక్కొని పెట్టుబడిదార్లకు, కార్పొరేట్లకు కట్టబెడుతుంది. 2013 భూసేకరణచట్టం అమలులో వుండగానే ఈ చట్టాన్ని తుంగలో తొక్కి దళిత, గిరిజన, బలహీన వర్గాల వారికి చెందిన భూములను లాక్కొని భూబ్యాంక్ ఏర్పాటుకు పూనుకున్నది. మరికొన్నిచోట్ల ల్యాండ్ పూలింగ్‌కు పూనుకుంటున్నది. ఇప్పటికే 13 జిల్లాల్లో 4లక్షలకు ఎకరాలకు పైగా 2,3 పంటలు పండే సారవంతమైన భూములకు నోటీసులు ఇచ్చింది. మరో 7లక్షల 60 వేల ఎకరాలు పేదలనుండి తీసుకోవడానికి ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ప్రకటించింది. వీటిలో సముద్రతీర, ప్రధాన రహదార్లు, రైల్వే లైన్లు ప్రక్కన ఉన్న దళిత, గిరిజన, బలహీనవర్గాలకు చెందిన భూములే అధికంగా వున్నాయి. భూములు ఇవ్వము అని తిరగబడిన రైతాంగం మీద, పేదల మీద నిర్బంధం ప్రయోగించి రాష్ట్ర ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తుంది. భూసేకరణ చట్టం(2013) కు తూట్లు పొడిచి గుజరాత్ తరహా చట్టాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నది. పేదలకిచ్చిన అసైన్డ్ భూములను పెద్దలకు కట్టబెట్టడానికి 9/77 చట్టాన్ని సవరించడానికి పూనుకున్నది.

ఇప్పటికే రాష్ట్రంలో అనేక సంవత్సరాలనుండి జరుగుతున్న ప్రాజెక్టులకు సరైన పరిహారం అందక రైతాంగం, పేదలు రోడ్డున పడ్డారు. శ్రీకాకుళం జిల్లా వంశధార ఫేజ్–2 నిర్మాణం వలన 28 గ్రామాలు కనుగరుగయ్యాయి. నేటికీ పరిహారం అందలేదు. పోరాడి సాధించుకున్న రూ.450 కోట్లు నేటికీ నిర్వాసితులకు పంపిణీ చేయలేదు. పోలవరం నిర్వాసితులు గ్రామలను ఖాళీ చేశారు. భూములూ, ఇళ్ళు కోల్పోయారు. నేటికీ సరైన పరిహారం అందలేదు. కర్నూలు జిల్లా శకునాల, అనంతపురం జిల్లా ఎన్‌పికుంట, విశాఖ జిల్లా నక్కపల్లి మండలంలో అనేక గ్రామాల్లో పరిశ్రమలకోసం భూములు తీసుకొని వారికి పరిహారం చెల్లించలేదు. వ్యవసాయ కార్మిక, వృత్తిదార్లకు ఎటువంటి నష్టపరిహారం ప్రతిపాదన లేదు. నెల్లూరు జిల్లా చిల్లకూరు, ముత్తుకూరు మండలాల్లో 6 గ్రామాలలో 33 వేల ఎకరాలు సముద్ర తీర ప్రాంతంలో పరిశ్రమలు, పవర్ ప్రాజెక్టుల పేరుతో గుంజుకున్నారు. ఇందులో 434 ఎకరాలు ఎకరాకు కోటి రూపాయలకు జిందాల్ కంపెనీకి అమ్ముకున్నది. భూసేకరణ చేసి 10 సంవత్సరాలు అయినా నేటికీ ఆ భూమిలో పరిశ్రమలు రాలేదు. ఇదే జిల్లాలో చింతవరం, ఏరూరు పంచాయితీలలో 2007లో 754 ఎకరాలు మాస్ ఫ్యాబ్రిక్స్ కంపెనీకి అప్పగిస్తే నేటికీ పరిశ్రమ రాలేదు. ఈ భూములన్నీ మాకు అప్పజెప్పాలని రైతాంగం పోరాడుతున్నది.

తూర్పుగోదావరి జిల్లా రైతులకు నష్టపరిహారం ఇవ్వకుండా దివీస్ కంపెనీకి భూములు కట్టబెట్టింది. కర్నూలు జిల్లాలో శకునాల, గని గ్రామాలలో సోలార్ విద్యుత్‌కోసం కొండజూటూరు, బలపనూరులలో నానో కెమికల్ ఫ్యాక్టరీకి రైతుల ఆమోదం లేకుండానే భూములు లాక్కున్నారు. మా భూములు మాకు కావాలని రైతాంగం పోరాడుతున్నారు. మచిలీపట్నం పోర్టుకు అవసరానికి మించి 33వేల ఎకరాలు ల్యాండ్ పూలింగ్‌లో తీసుకోవాలని ప్రభుత్వం పూనుకున్నది. దీనికి వ్యతిరేకంగా రైతాంగం, మత్స్యకారులు, పేదలు పోరాడుతున్నారు. ఇదే జిల్లాలో

వీరపనేని గూడెంలో రైతుల ఆమోదం లేకుండానే భూములు లాక్కోవడానికి ప్రభుత్వం పూనుకున్నది. ప్రకాశం జిల్లాలో నిమ్జ్ పేరుతో 41,163 ఎకరాలు పేదలు సాగుజేస్తున్న అసైన్డ్, ప్రభుత్వ, సన్న, చిన్నకారు రైతుల భూములను స్వాధీనం చేసుకుంటామని ప్రకటించింది. చిత్తూరు జిల్లాలో ఏ ప్రాజెక్టుకు ఎంత భూమి కావాలో చెప్పకుండా 43,859 ఎకరాలు తీసుకుంటామని ప్రకటించింది. రాష్ట్ర వ్యాపితంగా 2013 చట్టాన్ని ప్రక్కకు నెట్టి, అవసరాలకు మించి రైతాంగం ఆమోదం లేకుండా బలవంతంగా భూములు లాక్కొని పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు కట్టబెట్టడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నది.

తరతరాలనుండి దళితులు, గిరిజనులు, ఇతర పేదలు అనుభవిస్తున్న అసైన్డ్ భూములను భూస్వాములు, పెత్తందార్లు ఆక్రమించారు. ఈ భూములు మాకు అప్పజెప్పమని కృష్ణా జిల్లా ఇలపర్రు, చిత్తూరు జిల్లా వెత్తలతడక, నెల్లూరు జిల్లా రెట్టెపల్లె, కర్నూలు జిల్లా పుల్లకుర్తి గ్రామాలలో దళితులు పోరాటం చేస్తుంటే ప్రభుత్వం భూస్వాముల ప్రక్కన నిలబడి దళితులమీద అక్రమ కేసులు బనాయిస్తున్నది. దళితులు మరియు పేదలు చేస్తున్న ఈ పోరాటాలకు సిపియం సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నది. 9/77 చట్టాన్ని సక్రమంగా అమలుజేసి అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను తిరిగి పేదలకు అప్పజెప్పాలని డిమాండ్ చేస్తున్నది. అదే విధంగా 47 ఎస్ఈజెడ్‌ల పేరుతో ఇప్పటికే రాష్ట్రంలో 32,761 ఎకరాలు భూమి తీసుకొని ఇందులో కేవలం 5వేల ఎకరాలు మాత్రమే వినియోగంలో వుంది. మిగిలిన భూమంతా పడావుగా వుంది. ఈ భూములన్నీ తిరిగి పేదలు ఆక్రమించుకునేటట్టు చైతన్యవంతుల్ని చేయాలి. తెలుగుదేశం ప్రభుత్వం పేదల భూములను పెద్దలకు కట్టబెట్టడానికి 99 సంవత్సరాలు లీజుకిచ్చేందుకు తెచ్చిన జి.వోను రద్దుజేయాలి.

ప్రస్తుతం రాష్ట్రంలో రైతులు, వ్యవసాయ కార్మికులు, ఇతర పేదలు తమ భూములు రక్షించుకోవడానికి పెద్దఎత్తున ప్రతిఘటిస్తున్నారు. అదే విధంగా ప్రాజెక్టు క్రింద సర్వం కోల్పోయిన నిర్వాసితులు తమకు న్యాయమైన ప్యాకేజీ ఇవ్వాలని ఇప్పటికే దివీస్, శకునాల, వంశధార, పోలవరం ప్రాంతాల్లో పోరాడుతుంటే అనేకమందిపై కేసులు పెట్టి జైళ్ళకు పంపిస్తున్నారు. సంవత్సరం అంతా సెక్షన్ 30, నెలల తరబడి సెక్షన్ 144ని అమలుచేస్తున్నారు. శాంతియుతంగా జరిగే మీటింగ్‌లు, ఊరేగింపులకు కూడా అనుమతులు ఇవ్వకుండా అక్రమ అరెస్టులు చేస్తున్నారు. ఈ నిర్బంధాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. పేదలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నాం.

అభివృద్ధి పేరుతో అవసరాలకు మించి రైతుల ఆమోదం లేకుండా ప్రభుత్వపు బలవంతపు భూసేకరణను తీవ్రంగా ఖండిస్తున్నాం. భూసేకరణ చట్టం (2013), 9/77 చట్టాలను సవరించవద్దని డిమాండ్ చేస్తున్నాం.

= = = =